క్లుప్తంగా

మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఎంపికకు పరిశీలన


జక్కలచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు, రజాపురం గ్రామాల్లో మోడల్ ఫౌండేషన్ స్కూళ్ల ఎంపిక కోసం శనివారం రాష్ట్ర బృందం సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 మోడల్ ఫౌండేషన్ స్కూళ్లను ఎంపిక చేయాల్సి ఉంది. అందులో భాగంగా ప్రథమ్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సూరిబాబు, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులతో కూడిన బృందం పై రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. హాజరు, ఆటపాటల ద్వారా విద్యార్థులు చదువుకుంటున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సమగ్ర శిక్ష అధికారి చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఐసీకి విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: కర్ణాటక రాష్ట్రం బెళగావిలో ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకూ జరగనున్న నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్.విశ్వనాథ్, టి.స్మైలీ (ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు) ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. ఈ క్యాంప్‌లో ఎస్కేయూ తరఫున వెళ్లనున్న ఎన్‌ఎస్‌ఎస్ టీమ్‌లో వీరిద్దరు పాల్గొంటారని పేర్కొనఆనరు. ఎన్‌ఐసీకి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నారాయణ, భీమలింగయ్య అభినందించారు.

ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్టివల్'


ఆహార పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ ట్రైనర్ మంజు భార్గవి ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. న్యూట్రిషియన్ ఫుడ్, పోషక పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో భాగంగా బేకరీ ఫుడ్స్, విటమిన్స్‌పై విద్యార్థులకు చక్కగా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబహాన్, సీనియర్ ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు, శామ్యూల్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్ మూడవ వార్డులో శనివారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి తదితరులు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఎక్కడ అవసరమైతే అక్కడ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పీరా, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి జీఎం బాషా, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్, కౌన్సిలర్ ఫరూక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కెఎం.రంగనాయకులు, షఫీ, రమణ, బేటి బాషా, సాల్మన్ రాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలని ఏపీ జేఏసీ గుంతకల్లు తాలుకా చైర్మన్ సంపూర్ణ ఎస్తేర్, కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ర్యాలీ చేపట్టారు. స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి గాంధీచౌక్ వరకూ ర్యాలీ కొనసాగింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. మధ్యంతర భృతిని వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాఘవ, లక్ష్మీప్రసాద్, ఎర్రిస్వామి, నటరాజ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవా సారథులు


వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లదే కీలక పాత్ర' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గంలో ఉన్న వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో సొంత వారిని చూసుకొవడానికే భయపడుతున్న సమయంలో వలంటీర్లు తమ చుట్టూ ఉన్న 50 ఇళ్ల ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామునే లబ్ధిదారులకు ఠంచన్‌గా సామాజిక పింఛన్లను పంపిణీ చేసి వారి ప్రేమానురాగాలకు ఆప్తులు అయ్యారని తెలిపారు. కష్టకాలాల్లో ఉన్న సుదూర ప్రాంతాల్లో ఉన్న ఫించన్‌దారులకు కూడా వారి ఉంటున్న ప్రదేశానికే వెళ్లి వలంటీర్లు అందిస్తుండటం వారి సేవా నిరతిని చాటుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు నాంది పలికారని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలబడి సంక్షేమ పథకాల అమల్లో వలంటీర్లు ప్రజలకు అండగా ఉన్నారన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. తెలిసి తెలియని నిబంధనలతో కార్యాలయాలు, అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షణలు చేసేవారన్నారు. అయితే జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం వలంటర్లను శాలువాలతో సత్కరించి సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి, యాడికి ఎంపీడీఓ సావిత్రి, తాడిపత్రి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జిలాన్‌బాషా, పెద్దపప్పూరు ఈఓపీఆర్‌డీ కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.



చాలా ఆనందంగా ఉంది

నేను తాడిపత్రి పోరాటకాలనీలో వలెంటర్‌గా పనిచేస్తున్నాను. పేదలకు సేవ చేయడం అంటే నాకు ఇష్టం. జగనన్న ప్రవేశ పెట్టిన వలంటర్ వ్యవస్థ ద్వారా పేదలకు, చుట్టుపక్కల వారికి సేవ చేసే అదృష్టం నాకు కలిగింది. నా సేవలను గుర్తించి ప్రభుత్వం సేవా వజ్ర పురస్కారాన్ని అందించడం హర్షణీయం. ఈ సత్కారాన్ని జీవితంలో మరచిపోలేను.

– శ్రీలక్ష్మి, వలంటీర్, తాడిపత్రి



జగనన్న వల్లే మంచిపేరు

పట్టణంలోని పోరాట కాలనీలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ఈ రోజు నాకు చాలా ఆనందంగా ఉంది. వలంటీర్ పని ద్వారా మా చుట్టు పక్కన ఉన్న వాళ్లకు సేవ చేసే భాగ్యం కలిగింది. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తూ మా కాలనీలో మంచి పేరును తెచ్చుకున్నాను. అందువల్లే నాకు సేవావజ్ర పురస్కారం లభించింది. నా గుర్తింపు కారణమైన సీఎం జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటా.

– హేమవతి , తాడిపత్రి

యువచైతన్యయాత్రకు ప్రజా స్పందన కరువు

• హైప్ కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డి పాట్లు పడుతున్నారన్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న ఎంపీపీ బొందెలదిన్నె రామిరెడ్డి, రవిప్రసాద్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: సొంత మండలంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువచైతన్యయాత్రకు ప్రజా స్పందన కరువైంది. యాత్రకు హైప్ పెంచుకునేందుకు సొంత వారికే టీడీపీ కండువాలు కప్పి పార్టీ మారినట్లు అబద్ధాలు చెబుతూ జేసీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడు' అని పెద్దపప్పూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపప్పూరు ఎంపీపీ బొందెలదిన్నె రామిరెడ్డి మాట్లాడుతూ రెండు రోజులు క్రితం బొందిలదిన్నె గ్రామంలో ఐదుగురికి జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీకి వచ్చారని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. అయితే వారు బీజేపీ పార్టీకి చెందిన వారని, కుండువాలు వేసుకున్న వారిలో బీజేపీ పార్టీ పెద్దపప్పూరు మండల కన్వీనర్ కూడా ఉన్నాడన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కూడా వారు గ్రామంలోని టీడీపీ సానుభూతి పరుడికి మద్దతుగా నిలిచారన్నారు. వారికి వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేకపోయినా వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చారని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. కేవలం జేసీ సొంత మండలంలో బస్సుయాత్రకు హైప్ పెంచుకునేందుకే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జేసీ బస్సు యాత్రకు జనస్పందన లేదన్నారు. ఐదు రోజులుగా పెద్దపప్పూరు మండలంలో బస్సుయాత్ర పేరుతో గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అసంతృప్తి నాయకుల కోసం జేసీ చూస్తున్నారన్నారు. అయితే ఎవరూ రాకపోవడంతో సొంత వారికే టీడీపీ కండువాలు కప్పుతున్నారన్నారు. పెద్దపప్పూరు మండలంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎలాంటి సమస్యలు, గొడవలు లేకుండా చేశారన్నారు. మండల ప్రజలు వైఎస్సార్‌సీపీకే అండగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పెద్దపప్పూరు మండలం నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డికి భారీ మెజార్టీ అందించి జేసీకి మరోసారి బుద్ధి చెప్పడానికి జనం సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేమనాథరెడ్డి, ఎంపీటీసీ రామూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, రంగేశ్వరెడ్డి, రఘునాథరెడ్డి, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలాలి స్వామి జియారత్


మౌలాలి స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో మౌలాలీ స్వామి జియారత్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మౌలాలీ స్వామిని రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కొండపై నుంచి మౌలాలీ స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోకి తెచ్చి ఫకీర్లు మేళతాళాలతో గుర్రంపై ఊరేగించారు. దర్గాలో ముజావర్లు స్వామికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొక్కుబడి ఉన్న భక్తులు స్వామికి చక్కెర చదివింపులు చదివించి ఫాతెహాలు చేశారు. గ్రామంలోని వీధులు భక్తులు కిటకిటలాడాయి. గ్రామంలో చిన్నిపిల్లల ఆట వస్తువులు విక్రయించే అంగళ్లు వెలిశాయి. జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగిసాయని కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

నేడు కోటంకలో అన్నదానం

గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నేత, అనంతపురము మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. తన తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం భార్య వెంకట సుబ్బమ్మ, కుమారులు కొండారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో ఓ యువకుడు ఆత్మహత్మకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాము శనివారం ఇంటి వద్ద విషద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో పడిలో ఉన్న అతడని కుటుంబ సభ్యులు 108లో అనంతపురము ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఉచిత వైద్య శిబిరం


పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని కసాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పవన్‌కుమార్ పాఠశాలలోని దాదాపు 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, సెక్రెటరీ శివానంద, సభ్యులు రామాంజనేయులు, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ రేణుక, సెక్రెటరీ వరలక్ష్మి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల శాఖ ఏర్పాటు


అధ్యక్షుడు రామాంజనేయులు


ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

పామిడి: పట్టణంలోని నాగిరెడ్డి కాలనీ పాఠశాలలో శనివారం ఎస్టీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.నాగభూషణం సమక్షంలో ఎస్టీయూ మండల శాఖను ఏర్పాటు చేశారు. ఈ సంఘం నూతన మండల అధ్యక్షుడిగా వై.రామాంజనేయులు, నూతన ప్రధాన కార్యదర్శిగా వి.చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ అభ్యున్నతికి పాటుపడతామని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ పోరాటాలు చేస్తోందని జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు డి. కుళ్లాయప్ప, సి.రామాంజనేయులు, అగులూరప్ప, శ్రీనివాసులు, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మప్ప స్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: బసినేపల్లి గ్రామ శివారులోని గద్దెరాళ్ల కొండపై వెలసిన ఆలయంలో శనివారం తిమ్మప్ప స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు రవిప్రకాష్ రావు, సుధీంద్రనాథ్ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వేద మంత్రాలతో కల్యాణం జరిపించగా భక్తులు అక్షింతలు వేసి స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం స్వామికి విశేష అభిషేకాలు, లక్ష్మీనారాయణ హోమం, పల్లకీ సేవ, వసంతోత్సవం, దీపాలంకరణ సేవ, నామ సంకీర్తన, ఊయల సేవ, పవలింపు సేవలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. రాత్రి ఆలయ ఆవరణలో పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి అర్బన్: పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వికలాంగులకు ఉచితంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక పెన్షన్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్‌టీఓ ఫరూక్ మహమ్మద్ హాజరై వికలాంగులకు నిత్యావసర సరుకులను అందజేశారు. పెన్షనర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి , గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి అశ్వర్థరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి అవకాశాలు

పుట్లూరు: వృత్తి విద్యా కోర్సులతో భవిష్యత్తులో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యంపై ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యతో సులభంగా ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే ముస్లింల అభ్యున్నతి


ఎస్ఎస్ఎఫ్ జాతీయ సాహిత్యోత్సవ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్

గుంతకల్లుటౌన్: విద్యతోనే ముస్లిం, మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్ తెలిపారు. సున్నీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్), పాస్బుఏ అహ్లే సున్నహ కమిటీల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఈద్గా మైదానంలో ఎస్ఎస్ఎఫ్ జాతీయ స్థాయి సాహిత్యోత్సవ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఎమ్మెల్యే వైవీఆర్, నదీమ్ అహమ్మద్ సాహిత్యోత్సవ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యతోనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. చదువుల పోటీ ప్రపంచంలో విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా రాణించగలిగితే అన్ని రంగాల్లోనూ విజయం సాధించడం సులభమన్నారు. ఎస్ఎస్ఎఫ్ జాతీయ నేతలు, ముస్లిం మేధావుల సలహాలు, సూచనలతో ముస్లీం మైనార్టీల పిల్లలు విద్య, ఉపాధి రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గుంతకల్లులో జాతీయస్థాయి పోటీలను ఏర్పాటు చేసిన ఆయా కమిటీల సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ముస్లింల ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్ పీర్ సాహెబ్, మత గురువు యూసుఫ్‌బాషా ఖాద్రీ, నిర్వాహకులు హాఫీజ్ మన్సూర్‌అలీ, హాఫీజ్ ఇస్మాయిల్, మహమ్మద్ గౌస్, షేక్షావలి, సీఎం.ఫిరోజ్, రియాజ్, ఫారుఖ్, మహమ్మద్ అష్రఫ్, అబ్దుల్‌సత్తార్, కౌన్సిలర్ చాంద్‌బాష, 25 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో పాటు స్థానిక ముస్లీం మైనార్టీల పెద్దలు, ఆయా కమిటీల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం


ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం వడియంపేట గ్రామంలో 50.91 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఆయన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా పేదలకు స్వచ్ఛమైన నీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వడియంపేటలో నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని కోరారన్నారు. దీంతో రూ.50.91 లక్షల నిధులు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంక్ తోపాటు పైప్‌లైన్ వేశామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలు కిలోమీటర్ దూరం వెళ్లి నీరు తెచ్చుకునేవారన్నారు. జెడ్పీటీసీ భాస్కర్, ఆలూరి రమణారెడ్డి, ఎంపీడీఓ శోభారాణి, అనంత వెంకటరెడ్డి, పొడరాళ్ల సర్పంచ్ ఎర్రిస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జనార్ధన్, నాయకులు వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, పురుషోత్తం, రాజా, రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సంక్షేమ పథకాలను పక్కాగా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కొనియాడారు. సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్, పుట్లూరు రోడ్డులో ఎమ్మెల్యే పెద్దారెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పకూడదనే సిద్ధాంతానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్లు తలుపు తట్టి పింఛన్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. పాలనా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. ఇలాంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెంట కౌన్సిలర్లు చిన్న నాగిరెడ్డి, హీరాపురం ఫయాజ్‌బాషా, రాబర్ట్, రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, చింతల వెంకటరమణస్వామి ఆలయ ధర్మకర్తలమండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, జబ్బార్, అయూబ్, జిలాన్ తదితరులు ఉన్నారు.

సిద్ధం సభకు తరలిరండి


జొన్నలగడ్డ పద్మావతి


వీరాంజినేయులు

శింగనమల: రాప్తాడులో నేడు జరుగనున్న సిద్ధం బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజినేయులు, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కోరారు. ఈ మేరకు వారు శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రతి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

అరటితోట దగ్ధం



శింగనమల: నార్పల మండలం బొందలవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధమైంది. బాధిత రైతు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు చంద్రమోహన్ నాలుగెకరాల్లో అరటి తోట సాగు చేశాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అరటి చెట్లతోపాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. ఘటనలో రూ.6 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. రెవిన్యూధికారులు అరటితోటను పరిశీలించారు.